క్లుప్తంగా

కుమురం భీంకు నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణ కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా కళాశాలలో మంగళవారం కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురం భీం చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు కుమురం భీం జీవిత చరిత్రపై ప్రసంగించారు. పాటలు, నాటికలు ప్రదర్శించారు.

నేడు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో స్థానిక శ్రీకంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్య పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పెన్షనర్లు, రెగ్యులర్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న కాప రవికుమార్

నూతనకల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ సూచించిన అభ్యర్థుల విజయానికి బూత్‌స్థాయి నుంచే కార్యకర్తలు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొల్క కొమరయ్య, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మద్ది సంజీవరెడ్డి, వెంకటమల్లు, హన్మంతు, వీరస్వామి, ఉప్పలయ్య, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలి

నాగారం : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలను వెంటనే ప్రారంభించి పత్తి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో పత్తి రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పత్తి దిగుబడి వస్తున్నా నేటికీ సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు దళారులకు పత్తి అమ్ముకొని నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి ఆదుకోవాలన్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గుడిపూడి వెంకటేశ్వర్లు, రాములు, మహేందర్ తదితరులు ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ చర్యలను వ్యతిరేకించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నూతనకల్ : పాలస్తీనా, గాజాపై ఇజ్రాయెల్ చర్యలను ప్రపంచ మేధావులు, ప్రజాతంత్ర వాదులు వ్యతిరేకించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, దాసరి శ్రీనివాస్, మూరగుండ్ల మధు, సైదులు, రవి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఎస్‌ఐ మల్లేష్

కోదాడరూరల్ : టీసేఫ్ యాప్‌పై విద్యార్థులు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని భారత్ పబ్లిక్ స్కూల్‌లో షీ టీమ్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు.. సామాజిక మాధ్యమాలు, గంజాయి, గేమింగ్ లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగినప్పుడు చెప్పవద్దని సూచించారు. మహిళలు వేధింపులకు గురైతే 87126 86056 నంబర్‌కు, సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలి పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంత్రిప్రగడ శ్రీధర్ బాబు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత

- ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- ఇతర మెటీరియల్‌కూ పెరిగిన ధరలు


ఆత్మకూర్‌లో ఇసుక లేని కారణంగా నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

ఆత్మకూర్ (ఎస్): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలని ఆశించిన ఆత్మకూర్ (ఎస్) మండలం ప్రజలకు ఇసుక, మొరం కొరత తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోంది. దీంతో అనుకున్న సమయానికి ఇళ్లు పూర్తిచేసుకోలేక లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆత్మకూర్ (ఎస్) మండలంలో మొత్తం 1006 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 670 ఇళ్ల పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. అయితే, ఇందులో అధిక శాతం ఇళ్లు బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయాయి. త్వరితగతిన గోడలు నిర్మించి, స్లాబులు వేయాలని లబ్ధిదారులు ఆశిస్తున్నా, ఇసుక కొరత కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే ఉన్న పాత ఇళ్లను కూలగొట్టి, కొత్త ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాల వల్ల ఇసుక కొరత, అధిక ధరలు..

ఇంటి నిర్మాణానికి అత్యంత కీలకమైన ఇసుక కొరతకు ప్రధాన కారణం ఇటీవల కురిసిన భారీ వర్షాలే. ఆత్మకూరు మండలంలోని పాతర్లపహాడ్ నుంచి కొత్తగూడెం వరకు ప్రవహించే బిక్కేరు వాగుతో పాటు, ప్రభుత్వం అనుమతిస్తున్న మూసీ నది కూడా వరద నీటితో నిండుగా పారుతుండడంతో ఇసుకను తరలించడం సాధ్యం కావడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని, కొందరు అక్రమంగా బిక్కేరు వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతూ లబ్ధిదారుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. సాధారణంగా రూ. 4 వేల నుంచి రూ. 5 వేల మధ్య ఉండే ఒక టిప్పర్ ఇసుకను ప్రస్తుతం రూ. 9 వేల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇంత ధర పెట్టి కొనుగోలు చేయాలంటే పేద లబ్ధిదారులు అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి నెలకొంది.

మొరం దొరకడమూ కష్టమే..

ఇసుకతో పాటు, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మొరం కూడా దొరకడం లేదు. వర్షాకాలం కావడంతో చెరువులు, కుంటలు నీటితో నిండి ఉండడం, అలుగులు పారుతుండడంతో మొరం కోసం వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్నిచోట్ల మొరం కూడా అధిక ధరలకు అమ్ముడవుతున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనుల పూర్తికి 'డెడ్‌లైన్' విధించడం.. మరోవైపు ఇసుక, మొరం దొరకకపోవడం, దొరికినా అధిక ధరలు ఉండడంతో లబ్ధిదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి మరింత సమయం ఇవ్వాలని, అదే విధంగా ఇసుక, మొరంను సరసమైన ధరలకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పది రోజులుగా పనులు నిలిచిపోయాయి


ఇంటి నిర్మాణం ప్రారంభించి నెల దాటింది. ఇంటికి అడ్డ భీముల లెవెల్ వరకు పనులు పూర్తయినా, మొరం, ఇసుక కొరత కారణంగా దాదాపు పది రోజులుగా పనులు నిలిచిపోయాయి. వర్షాకాలంలో కిరాయి (అద్దె) ఇళ్లలో ఉండటం చాలా ఇబ్బంది అవుతోంది.
– దొంతరబోయిన రజిత, తుమ్మలపెన్‌పహాడ్

ఇసుక, మొరం దొరకడం లేదు


ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక, మొరం దొరకడం లేదు. నిర్మాణం మొదలు పెట్టడానికి ఇసుక ఒక ట్రిప్పును అధిక ధరకు కొనుగోలు చేశాం. కానీ ఇప్పుడు మళ్లీ దొరకడం లేదు. దీంతో మా ఇంటి పనులు పూర్తిగా నిలిచిపోయాయి.
– పగిడి సీతమ్మ, ఆత్మకూర్(ఎస్)

శ్రీసుదర్శన సహిత లక్ష్మీనరసింహ హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : అశ్వయుజ మాసపౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీసుదర్శన సహిత లక్ష్మీనరసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అఖిల కుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం జరిపారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రామయ్య, కమిటీ అధ్యక్షుడు చకిలం క్రిష్ణకుమార్, మురళీ క్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్


కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న సంతోష్‌కు పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన దండుగల సంతోష్ కిడ్నీల సమస్యతో చావుబతుకుల్లో ఉండగా విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రెండు విడతలుగా రూ.7లక్షలు మంజూరుచేయించారు. దీంతో సంతోష్‌కు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగి కోలుకోవడంతో మంగళవారం గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరామర్శించి పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ ఎమ్మెల్యే సామేల్, మధుకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వజ్జె చినవీరయ్య, వాక శ్రీను, వల్లపు వెంకన్న, దోరేపల్లి వీరమల్లు, మర్రి రాజశేఖర్, జడ శ్రీను, నాగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎన్జీఓ సభ్యులు

ఆత్మకూరు (ఎస్) : తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశానుసారం మనో ప్రకాష్ హ్యూమన్ సర్వీసెస్ ఎన్జీఓ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కందగట్ల, ఇస్తాళపురం పాఠశాలల్లో హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ ప్రాజెక్టు డైరెక్టర్ కొండ వెంకన్న మాట్లాడారు. కలుషిత రక్తమార్పిడిలు, అక్రమ లైంగిక సంబంధాలతో హెచ్‌ఐవీ సోకుతుందన్నారు. అనంతరం హెచ్‌ఐవీపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యశోద, జ్యోతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో కొనసాగుతున్న పనులు

- అర్వపల్లిలోని కస్తూరిబా పాఠశాలకు రూ.15లక్షలు మంజూరు
- సమకూరుతున్న మౌలిక వసతులు



కొత్త హంగు సంతరించుకున్న అర్వపల్లి కేజీబీవీ

అర్వపల్లి : బాలికలకు ఉచితంగా వసతితో పాటు భోజనం, విద్య అందిస్తున్న కస్తూరిబాగాంధీ విద్యాలయానికి కొత్త హంగు సంతరించుకుంటుంది. కొన్నేళ్లుగా అర్వపల్లిలోని కేజీబీవీలో వివిధ సమస్యలతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇక్కడి కేజీబీవీ ఈ విద్యా సంవత్సరం కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. దీంతో ఇంటర్ మొదటి సంవత్సరాన్ని ప్రారంభించారు. కాగా కేజీబీవీలో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. కేజీబీవీకి మొదటి విడతలో రూ.7లక్షలు, రెండో విడతలో రూ.8లక్షల చొప్పున డీఎంఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవనానికి ఇప్పటికే రంగులు వేసే పనులు పూర్తి చేశారు. డ్రెయినేజీ శుభ్రం చేసే పనులు పూర్తి అయ్యాయి. మరుగుదొడ్ల మరమ్మతు, ఎలక్ట్రికల్ పనులు, మెస్‌డోర్ల బిగింపు, ఫ్యాన్‌ల రిపేరు తదితర పనులు కూడా చేపట్టారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతుతో పాటు ఇంకా ఏఏ పనులు చేపట్టాలనే విషయమై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సమస్యలు తీరుతున్నాయి


కేజీబీవీలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పనులకు నిధులు మంజూరు కాగా రంగులు వేయడం పూర్తయ్యింది. అలాగే డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేపట్టారు. మిగిలిన పనులు జరుగుతున్నాయి. దీంతో సమస్యలు తీరుతున్నాయి. – నాగరాణి, ఎస్‌ఓ, కేజీబీవీ

ముగిసిన ఉత్సవాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని భరద్వాజ ఆశ్రమంలో జరుగుతున్న మహాలక్ష్మి వార్షిక పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతి ఏటా లోక కల్యాణార్థమై ఈ ఆశ్రమంలో 15 రోజుల పాటు మహాలక్ష్మి వార్షిక పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ తెలిపారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి రాజ్యాంగ విరుద్ధమైన చర్య


చివ్వెంల: సూర్యాపేటలో కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


తుంగతుర్తి : నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : సనాతన ధర్మం పేరుతో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. దాడిని ఖండిస్తూ కేవీపీఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ జంగం కరుణాకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొల్లెద్దు వినయ్, పీఎస్ఎమ్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి రాంబాబు, మాల మహానాడు జేఏసీ జిల్లా కన్వీనర్ వీర్జాల వేణు బలరాం, మాల మహానాడు జిల్లా నాయకులు బోయల అఖిల్, కేవీపీఎస్ నాయకులు దేవరకొండ గిరి, నందిపాటి సతీష్, సూర్యతేజ, ఉదయ్ పాల్గొన్నారు.

చివ్వెంల : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి తగదని, దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిశోర్ పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయ వ్యవస్థకే చెడ్డ పేరు తీసుకువస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, న్యాయవాదులు వసంత సత్యనారాయణ పిల్లే యాదవ్, ధరావతు వీరేష్, బానోతు మంగులాల్, దావుల వీరప్రసాద్ యాదవ్, ఏడిండ్ల అశోక్, ప్రతాప్, భరత్ కుమార్, అనంతుల సందీప్ కుమార్, జటంగి శ్రీనాథ్‌యాదవ్, మీసాల శ్రీనివాస్, అనిల్ కుమార్, సతీష్, కాసం సరిత, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట అర్బన్ : నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ మాల మహానాడు నాయకులు


తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు

తుంగతుర్తి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం దారుణమని, సనాతన ధర్మం ఎంత ప్రమాదమో ప్రజలు తెలుసుకోవాలని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరిన చర్యను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పర్వీన్, జాయింట్ సెక్రటరీ మల్లెపాక రవికుమార్, న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, తాళ్లపల్లి సత్యనారాయణ, వంగాల నాగరాజు, ఓర్సు రాజు, షేక్ వజీర్, గుగులోతు రాజారాం, పులిచెర్ల శ్రీనివాస్, బానోతు ప్రతాప్ పాల్గొన్నారు.

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి చర్యలు తగవని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై మతోన్మాదులు చేసిన దాడిగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నరసయ్య, నాయకులు చంద్రయ్య, రామయ్య, వీరమల్లు, వెంకన్న, దశరథ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పూలే–అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య చెప్పారు. మంగళవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తిచేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించాలి


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. మంగళవారం తిరుమలగిరిలో ఆ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీ సంఘాల పోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిందని తెలిపారు. కొంతమంది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేశారని అన్నారు. ఈ నెల 8వ తేదీన రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడుతుందని, అన్ని రాజకీయ పార్టీలు గవర్నర్ వద్దకు వెళ్లి బిల్లును ఆమోదించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి ప్రవీణ్, వంగరి బ్రహ్మం, యాదగిరి, ప్రభాకర్, చంద్రమౌళి, సోమ నారాయణ, సోమయ్య, వెంకన్న, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు


రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నిలిచిన నీరు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం నుంచి తుంగగూడెం వెళ్లే దారిలో ముత్యాలమ్మగుడి వద్ద రోడ్డుపై గుంతలేర్పడి నీళ్లు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల సమీపంలోనే రోడ్డు వెంట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో నీళ్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఆ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే సంబంధిత అధికారులు రోడ్డును మరమ్మతు చేయించి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



సూర్యాపేటటౌన్ : వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు

భానుపురి : రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి ఆదికవి అని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. వాల్మీకి శ్రీరాముని జీవిత చరిత్రను, ధర్మ మార్గాన్ని తన రామాయణం ద్వారా సమాజానికి తెలియజేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మహర్షి వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ధర్మ మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ యాదగిరి పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ కె.నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నీతి మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్‌ఐలు సురేష్, సాయిరాం, అశోక్, సీసీ సందీప్, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్ : పట్టణ కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతిని తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి మాట్లాడారు. వాల్మీకి మహర్షి బోధించిన నీతి, ధర్మం, సత్యం వంటి విలువలను మన జీవితాల్లో ఆచరణలో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ టి.గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, గిర్దావర్లు రామరాజు జలేందర్‌రావు, ప్రసన్న, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు, శిల్పిక పాల్గొన్నారు.

నూతనకల్ : మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ ఎం. శ్రీనివాస రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..


నూతనకల్ : తహసీల్దార్ కార్యాలయంలో..


అర్వపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో..

తోవల్లో బావులు.. ప్రమాదాలకు పిలుపులు


అర్వపల్లి - కొమ్మాల రహదారి వెంబడి ప్రమాదకరంగా ఉన్న బావి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి–కొమ్మాల రహదారి వెంట రోడ్డు పక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ బావులు కొన్ని వాడుకలో లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు బావులు ఉన్న ప్రదేశాల్లో భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న బావుల వద్ద హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో కలిసి పనిచేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న కోట గోపి

మద్దిరాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో సీపీఎంతో కలిసొచ్చే శక్తులతో కలిసి పనిచేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించేందుకు లౌకిక పార్టీలతో అవగాహన చేసుకొని ముందుకు వెళ్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ బలమైన స్థానాలలో సొంతంగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మద్దిరాల మండలంలో జెడ్పీటీసీ, మూడు ఎంపీటీసీ, నాలుగు సర్పంచ్ స్థానాలలో పోటీ చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి పాలోజు సైదులు, కల్లెపల్లి భాస్కర్, పాల్వాయి కవిత, మోష, మల్లారెడ్డి, నారాయణ, మీనయ్య, బ్రహ్మం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.